అందరి సంక్షేమమే సీఎం లక్ష్యం

రాజేంద్రపాలెంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



వైస్ ఎంపీపీకి బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఇతర నేతలు

కొయ్యూరు: అందరూ బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని పాడేరు ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని కాంక్షిస్తున్నారన్నారు. ఆమె గురువారం సాయంత్రం రాజేంద్రపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 242 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గరైందని తెలిపారు. ఒకప్పుడు మండల కేంద్రానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా ప్రజలు సచివాలయాల వద్దకు వెళ్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాల నుంచి ఎరువుల వరకు ఆర్బీకేల వద్ద లభిస్తున్నాయన్నారు. ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని తెలిపారు. గతంలో చూడని ఉత్తమ పాలనను అందిస్తున్నామన్నారు. ఒకప్పుడు పింఛన్ల కోసం అవ్వ తాతలు ఎదురు చూడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు వలంటీర్ల ద్వారా నేరుగా వారి ఇంటి వద్దకు వెళ్లి ఇస్తున్నారని తెలిపారు. సీసీరోడ్డు ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్ పీటా సింహాచలం కోరారు. వాటికి నిధులు విడుదల చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆమె దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జల్లి బాబులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, ఎంపీటీసీ మల్లేశ్వరి, మూలపేట సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి, చీడిపాలెం సర్పంచ్ ఎస్. సోమన్నదొర, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు సావిత్రి, ఎంపీడీవో మేరీరోజ్, తహసీల్దారు తిరుమలరావు, జేఈ విశ్వతేజ, సచివాలయ కన్వీనర్లు శేఖర్, తిరుపతి, జి. చిన్నారావు, నేతలు ఎస్. సత్యారావు, తాతారావు, గంగాధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ ప్రోత్సాహకం



విద్యార్థిని సృజనకు వాచ్ బహూకరిస్తున్న ఉపాధ్యాయినులు

అడ్డతీగల: పదో తరగతిలో ఉన్నత శ్రేణిలో పాసై పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన గిరిజన విద్యార్థిని కుడుముల సృజనకు వాచ్ బహూకరించారు. గత ఏప్రిల్ 12న అడ్డతీగల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాపరెడ్డి సందర్శించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికకు తన పేరిట ఒక వాచ్ అందజేయాలని రూ.1,500 అప్పట్లో హెచ్‌ఎం శాంతిమతికి అందజేశారు. ఈ నేపథ్యంలో సృజన 452 మార్కులు సాధించడంతో టైటాన్ వాచ్‌ని ఉపాధ్యాయినులు గురువారం అందజేశారు.

బోరు పనులు పరిశీలన



బోరును పరిశీలిస్తున్న అధికారులు

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో సాయినగర్‌లో, దోమలగొంది ఏరియాలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా నిర్మించిన బోరు పనులను పాడేరు (విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్) డీఈఈ పి.చంద్రకిరణ్ గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా చూసుకోవాలని, త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చింతపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రుక్మేంద్రరాజు, ఏఈఈ స్వర్ణలత పాల్గొన్నారు.

త్వరితగతిన చెరువుల పునర్నిర్మాణ పనులు



అనిగేరులో చెరువు పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన చెరువుల పూడికతీత (పునర్నిర్మాణ) పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. గురువారం ఆయన అడ్డతీగల పంచాయతీ అనిగేరులోని చెరువుల్లో పూడికతీత పనులను పరిశీలించారు. వేసవి ముగిసి వర్షాకాలం ఆరంభం కల్లా ఎంత ఎక్కువగా పూడికతీత పనులు చేస్తే, అంత నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. సాగు భూములకు పుష్కలంగా నీరందుతుందన్నారు. సాగును ప్రోత్సహించడానికి పూడికతీత పనులు వేగవంతం చేయడం వల్ల రైతులకు మేలు చేస్తుందన్నారు. నిబంధనల మేరకు అలవెన్సులన్నీ కలిపి రోజుకు ఒక్కో వేతనదారుకు రూ.272 వేతనంగా నమోదు చేయడానికి అవకాశం ఉందన్నారు. పనుల విధానాన్ని బట్టి ప్రతి వేతనదారుకు మస్తర్లు నమోదు చెయ్యాలన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గంగవరం: స్థానిక విద్యుత్ సబ్‌సెంటర్ మరమ్మతుల నిమత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ యూసఫ్ తెలిపారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

మలేరియా నివారణకు ముందస్తు చర్యలు



రామచంద్రాపురంలో మలేరియా పిచికారీ చేస్తున్న సిబ్బంది

కూనవరం: మండలంలో మలేయా నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని కూనవరం, గౌరిదేవిపేట పీహెచ్‌సీ వైద్యులు సునీల్, శేసిరెడ్డి అన్నారు. పోచవరం గ్రామ సచివాలయం పరిధిలోని రామచంద్రాపురం, తాటిలంక, బోదునూరు, మెట్టరామవరం తదితర గ్రామాల్లో గురువారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్న గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ డి.శ్రీనివాస్, మలేరియా సూపర్‌వైజర్ రాజేష్, హెల్త్ అసిస్టెంట్ అర్జున్, ఏఎన్‌ఎం అరుణకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ బేబి, ఆశ వర్కరు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

26న మండల సర్వసభ్య సమావేశం

మారేడుమిల్లి: ఎంపీపీ సార్ల లలితకుమారి అధ్యక్షతన స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న మధ్యాహ్నం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.అశోక్ కుమార్ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మారుమూల ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు

పెదకోడాపల్లిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పెదకోడాపల్లి పంచాయతీలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: ప్రభుత్వం మారుమూల గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పెదకోడాపల్లి పంచాయతీ బంగారుపుట్టు, గొచ్చరి, దూరుపల్లి గ్రామాల్లో 183 గడపలు తిరిగారు. నాలుగేళ్ల పాలనలో అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతుందని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో పింఛన్ పొందడానికి అనేక కష్టాలు పడాల్సిన పరిస్థితి ఉండేదని, నేడు ఇంట్లో ఉంటేనే అన్ని పథకాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా ఖాతాల్లో జమ చేస్తున్నారని పేర్కొన్నారు. పింఛన్ రూ.2,750 ఇస్తున్నారని, వచ్చే ఏడాది రూ.3 వేలు చెల్లిస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. పంచాయతీలో అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం, వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలని దివంగత సర్పంచ్ సెగ్గె వెంకటరమణ తనను కోరారని గుర్తు చేశారు. పార్టీ మంచి నాయకుడ్ని కోల్పోయిందన్నారు. అతని కోరిక మేరకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

ఇంటికి వచ్చి అడిగిన వారు మీరే..

పెదకోడాపల్లి పంచాయతీ గ్రామాల్లో మహిళలు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు పూలదండలు వేసి హారతులతో ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు చేరుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు అనేక మంది ఎమ్మెల్యేలుగా పని చేశారని, ఇంటింటా వచ్చి పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగిన వారు లేరని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, సర్పంచ్ మోహన్‌రావు, ఎంపీటీసీ అప్పారావు, మాజీ సర్పంచ్ కమలాకర్, గోపాలరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు త్వరితగతిన పూర్తి



కిచెన్ షెడ్‌కు భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ విజయ

కూనవరం: జగ్గవరం జీపీఎస్ పాఠశాలలో రూ.12 లక్షలతో చేపట్టిన నాడు - నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీటీసీ గుజ్జా విజయ తెలిపారు. ఆయా పనుల్లో భాగంగా కిచెన్ షెడ్ నిర్మాణానికి గురువారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ రుక్మిణి, ఉపాధ్యాయిని ఎస్. రామలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, గడేసుల ప్రేమ్‌చందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మోదకొండమ్మ ఉత్సవాల సందర్భంగా క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

పెదబయలు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతోందని సీతగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ కిమంకరి బొంజుబాబు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు మోదకొండమ్మ ఉత్సవాల సందర్భంగా గురువారం పెదబయలు రైజింగ్ గ్రీన్ స్టార్స్(ఆర్‌జీఎస్) ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడా పోటీలతో క్రీడాకారుల మధ్య మంచి స్నేహభావం పెరుగుతుందన్నారు. టోర్నీలో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. విజేత జట్టుకు రూ.30 వేలు బహుమతి ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ.15 వేలు, ట్రోఫీ అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభ మ్యాచ్ ఆర్‌జీఎస్ పుష్ప-లెవెన్స్ మధ్య జరిగింది. కార్యక్రమానికి పాంగి పాల్గుణ, లక్ష్మీపేట సర్పంచ్ అశోక్, రెండు మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

‘పండగలు సంప్రదాయానికి ప్రతీకలు’



మరిడిమాంబను దర్శించుకున్న ఎంపీ సత్యవతి దంపతులతో తుమ్మపాల నాయకులు

అనకాపల్లి రూరల్ : గ్రామ దేవతల పండగలు సంప్రదాయానికి ప్రతీకలని అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. గురువారం మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ వెంకుపాలెం రోడ్డులో ఉన్న మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎంపీ దంపతులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండగలు గత సంస్కృతిని ప్రస్తుత తరానికి తెలపడంతోపాటు, ప్రజల మధ్య ఐక్యతకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీటీసీ పన్నీరు వెంకట్రావు, పడాల గణపతి, ఆర్బీసీ సత్యనారాయణ, శంకర్రావు, తుమ్మపాల చక్కెర కర్మాగారం కార్మిక సంఘం నాయకుడు పీవీఎస్ అప్పారావు, చదరం శివ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నెలవు.. దేవతల కొలువు

- చోడవరం శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయానికి రాజగోపురాల శోభ
- రూ. 3 కోట్లతో నిర్మాణం
- 4 నుంచి 7 వరకు మహోత్సవాలు

చోడవరం: జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా చోడవరం మరింత అభివృద్ధి చెందుతోంది. కాణిపాకం తర్వాత అంతటి ప్రాముఖ్యత సంతరించుకుని చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం ఈ ప్రాంతంలో ఎంతో ప్రాచుర్యం కలిగి ఉంది. ఇప్పుడు ఆలయానికి మూడు దిక్కులా రాజగోపురాల నిర్మాణంతో కొత్తశోభ సంతరించుకుంది. ప్రాచీన మత్స్యరాజుల కాలంనాటి కోనేరు కలిగిన స్వయంభూ గౌరీశ్వరస్వామి, 800 ఏళ్ల నాటి శ్రీ కేశవస్వామి ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. గత ప్రభుత్వాల హయాంలో ఈ ఆలయాలు అభివృద్ధి లేకుండా ఉండిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రత్యేక చొరవతో ఈ ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇక్కడి స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయానికి గతంలో ఉత్తర ముఖద్వారం మాత్రమే ఉండేది. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ ఆలయానికి అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీలు ఏర్పాటు చేసి ఆలయానికి మిగతా మూడు పక్కలా రాజగోపురాలతో ముఖద్వారాలు నిర్మించారు. సుమారు రూ. 3 కోట్లకు పైబడే ఖర్చు చేసి ఈ నిర్మాణాలు చేపట్టారు. ఇందుకుగాను తొలుత విప్ ధర్మశ్రీ రూ. 40 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసేలా కృషి చేశారు. నిధులు మంజూరైన తర్వాత తూర్పు రాజగోపుర నిర్మాణం మొదలు పెట్టారు. అటు పిమ్మట దాతలు కూడా ముందుకొచ్చి సహకరించడంతో ఆలయాభివృద్ధికి రూ. 3 కోట్లకు పైగా వెచ్చించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా ఇతిహాసాలను అనుసరించి ఈ విగ్రహాలను ఇక్కడి రాజగోపురాలపై నెలకొల్పారు. ప్రముఖ ఆలయాల నిర్మాణ శిల్పకారుడు చిన్న పర్యవేక్షణలో ఈ రాజగోపురాలు నిర్మించారు. ఇప్పటికే వీటిలో తూర్పు, పశ్చిమ రాజగోపురాల నిర్మాణం పూర్తి కాగా వీటికి ప్రధాన ముఖద్వారాలు కూడా భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. వచ్చేనెల 4 నుండి 7 వరకు రాజగోపురాల కళల ప్రతిష్టా మహోత్సవాలు జరగనున్నాయి. మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఈ ఆలయం ఉండటంతో కొత్తగా నిర్మించిన తూర్పు రాజగోపురం నుంచి ఇకపై భక్తులు ఆలయంలోకి ప్రవేశించేలా ఏర్పాట్లు చేశారు. ఈ మూడేళ్లలో ఎంతో అభివృద్ధి జరుగుతుండటంతో ఇప్పుడు చోడవరం ఆధ్యాత్మిక క్షేత్రంగా మరింత శోభతో కనువిందు చేస్తోంది. ఆలయాల అభివృద్ధిపై భక్తులంతా ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయానికి నిర్మించిన రాజగోపురాలతో కొత్త శోభతో కనిపిస్తున్న ఆలయం

ఆధ్యాత్మికతతో మిళితమైన చోడవరం చరిత్ర



ఉత్తరాంధ్ర జిల్లాల పుణ్యక్షేత్రాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామివారి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాం. చోళరాజుల నాటి కాలంలో ఈ గ్రామానికి ఎంతో ప్రత్యేకత ఉంది. సాహిత్యపరంగా కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇక్కడి హార్డింజ్ గెస్ట్ హౌస్ ఆవరణలో కళాభారతి ఆడిటోరియం నిర్మించాలని ప్రతిపాదన చేశాం. త్వరలో నిధులు మంజూరు చేయించి ఆడిటోరియం నిర్మిస్తాం.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, చోడవరం

నాలుగు రాజగోపురాలతో పుణ్యక్షేత్రంగా..



ప్రధాన ఆలయానికి నాలుగు రాజగోపురాలు నిర్మించడం వల్ల ఆలయం పుణ్యక్షేత్రంగా మారుతుంది. నాలుగు గోపురాల ద్వారా మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించడం వల్ల ఆలయానికి దైవ సంకల్పబలం రెట్టింపు అవుతుంది. 20 ఏళ్లుగా తూర్పు దిశతో పాటు మిగతా మూడు దిశల్లో రాజగోపురాలు నిర్మించాలని ప్రయత్నిస్తున్నా నేటికి కార్యరూపం దాల్చింది. ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

–కొడమంచిలి చలపతిరావు, ప్రధాన అర్చకుడు

రెజ్లర్లను వేధించిన ఎంపీని అరెస్టు చేయాలి

- సీఐటీయూ డిమాండ్

అనకాపల్లిటౌన్ : మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మహిళా రెజ్లర్లకు మద్దతుగా దేశ వ్యాప్తంగా 25 రోజులుగా ఆందోళన చేస్తున్నా, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. వెంటనే బీజేపీ ఎంపీపై పోక్సో, నిర్భయ చట్టాల కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.


షిర్డీ సాయిబాబా మందిరంలో అన్నదానం



అన్నదానంలో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం పేదలకు భారీ ఎత్తున అన్నదానం జరిగింది. ఉదయం చుట్టు పక్కల నుంచి అశేషంగా హాజరైన భక్తులు బాబా దర్శనం కోసం బారులు తీరారు. అర్చకులు భయ్యా భానుమూర్తి విశేష పూజలు జరిపించారు. మధ్యాహ్న హారతి, అనంతరం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేయగా పెద్ద ఎత్తున హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమానికి విశాఖపట్నానికి చెందిన సిద్దార్థ, విజయ దంపతులు విరాళం సమర్పించినట్లు ఆలయ కమిటి తెలిపింది.

పర్యావరణానుకూల అభివృద్ధికి కృషి



సదస్సులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

అనకాపల్లిటౌన్ : పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలంటే పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, మొక్కలను ఎక్కువగా నాటాలని జిల్లా ఫారెస్ట్ రీసెర్చ్ రేంజ్ అధికారి కె.ఉమామహేశ్వరి అన్నారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై గురువారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడుకునేలా అభివృద్ధి ఉండాలని సూచించారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని మొక్కలను నాటి, వాటి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఫారెస్ట్ అధికారులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాము కాటు

నాతవరం: శృంగవరం గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువులో ఉపాధి పనులు చేస్తుండగా ఒకరు పాము కాటుకు గురయ్యారు. గ్రామానికి చెందిన నేతల చెల్లయ్య గురువారం చెరువులో పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే ఏపీవో చిన్నారావు చెల్లయ్యను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చెల్లయ్య ఆరోగ్య పరిస్థితి బాగుందని ఉపాధి సిబ్బంది తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన బొడ్డు హోమరావు

పరవాడ: స్థానిక జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివాసం ఉంటున్న బొడ్డు హోమరావు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని అతని భార్య రామలక్ష్మి పరవాడ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కాలనీ వాసులు, పరిసర గ్రామాల్లో వెతికారు. అయినా ప్రయోజనం లేక పోవడంతో రామలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

మరో యువకుడు



రుషేంద్ర

పరవాడ: పెదముషిడివాడ గ్రామానికి చెందిన పి.రుషేంద్ర అనే యువకుడు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని అతని తండ్రి పళ్లా అప్పారావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలు.. అప్పారావు కుమారుడు రుషేంద్ర ఏడాది కిందట ప్రేమ వివాహం చేసుకొన్నాడు. కాగా రుషేంద్ర పై అతని భార్య కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్థాపం చెందిన రుషేంద్ర ఈ నెల 16న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. కుటుంబ సభ్యులు పరిసర గ్రామాల్లో వాకబు చేసినా ప్రయోజనం లేదని అప్పారావు పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

క్లుప్తంగా

బాబాను దర్శించుకున్న ఎంపీ మాధవి



అరకు ఎంపీని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా షిర్డీసాయిబాబా ధ్యాన మందిరాన్ని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దంపతులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపకులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు వీరిని ఘనంగా సత్కరించారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పరిశీలన



కిట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ముందుగానే జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. నోటుపుస్తకాలు 47,444, పాఠ్యపుస్తకాలు 56,752 వచ్చాయన్నారు. వీటిని స్టాక్ పాయింట్లో నిల్వ చేశామన్నారు. ఎంఈవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు. ఎంపీయూపీ పాఠశాలలో నాడు - నేడు పనులను పరిశీలించారు.

ఇన్‌చార్జి ఎంఈవోగా కృష్ణమూర్తి



కృష్ణమూర్తి

జి.మాడుగుల: ఇన్‌చార్జి ఎంఈవోగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న కృష్ణమూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు పని చేసిన ఎంఈవో నాగభూషణం విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇన్‌చార్జి మండల విద్యాశాఖ అధికారి (ఎఫ్‌ఏసీ)గా కృష్ణమూర్తిని నియమిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్సాహంగా మ్యూజికల్ చైర్ పోటీలు



కుర్చీ ఆటలాడుతున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథపాలకురాలు శెట్టి సునీత ఆధ్వర్యంలో గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ



పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: కించుమండ పంచాయతీ కోసంగుడ ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం విలీయం కేరీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి విద్యార్థి సక్రమంగా చదువుకోవాలని సూచించారు. ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ వేసవిలో విద్యార్థులు ఆటపాటలతో కాలం గడిపేయకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టి వారిని ప్రోత్సహించాలన్నారు.

గంగవరంలో వైద్య శిబిరం రేపు

గంగవరం: రాజమహేంద్రవరం డెల్టా ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక వారపు సంతలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి మార్కెటింగ్ స్టాఫ్ క్రాంతి కుమార్, కె.ప్రసాద్ పట్నాయక్ తెలిపారు. ఈ శిబిరంలో సుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచిత చేస్తామన్నారు.